## ఎమ్మెల్యే సత్యనారాయణకు ఘన సన్మానం




ఇబ్రహీంపట్నంలో అంకిత దవాఖాన వైద్యురాలు అనురాధ జన్మదినాన్ని పురస్కరించుకుని దవాఖాన ఎండీ, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణను శనివారం కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీంపట్నంలో ఘనంగా సన్మానించారు.

**- ఇబ్రహీంపట్నం, జూలై 20**

## వానకాలం అప్రమత్తంగా ఉండాలి



షాద్‌నగర్‌టౌన్, జూలై 20: కురుస్తున్న వర్షాలతో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ సూచించారు. మున్సిపాలిటీలోని 8వ వార్డులో శనివారం పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వార్డులకు సంబంధించిన కాలనీల్లో ఎక్కడా వర్షపునీరు నిల్వకుండా చూడాలని, మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు సుధీర్, మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, జావీద్ ఉన్నారు.

## కాంగ్రెస్‌తో నిరుద్యోగులకు అన్యాయం




షాద్‌నగర్‌టౌన్, జూలై 20 : నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. శనివారం బీజేవైఎం నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నందుకు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి బీజేవైఎం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, డీఎస్సీ పరీక్షా తేదీలను పోస్ట్‌పోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలన్నారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో 46ను రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, సాయిగౌడ్, మల్లేశ్, విజయ్, యాదయ్య, మణికంఠ, శ్రీశైలం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



చేవెళ్ల రూరల్, జూలై 20 : చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడ ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను శనివారం మాజీ సర్పంచ్ నడిమొల్ల లావణ్యాశంకర్, గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో టీచర్ల కొరత ఉన్నందున ఇద్దరు ప్రైవేట్ టీచర్లను ఏర్పాటు చేసి వారికి జీతాలు ఇస్తానని మాజీ సర్పంచ్‌లావణ్య శంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

## విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దఅంబర్‌పేట, జూలై 20: ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సమస్యలు పరిష్కరించాలని జిల్లా మనుమయ సంఘం ప్రతినిధి పోలోజు అరుణ్‌కుమార్ చారి విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం డిమాండ్ల సాధనకు ఆదివారం నగరంలోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి తరలిరావాలని కోరారు. విశ్వబ్రాహ్మణ కమ్మరి, వడ్రంగి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని కోరారు. బీసీ వెల్ఫేర్ అధికారుల ద్వారా ప్రతి కుటుంబానికి రైతుబీమా తరహాలో విశ్వబ్రాహ్మణ బీమా సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## రోడ్డు ఇలా.. ప్రయాణమెలా..?

**అధ్వానంగా యాచారం-కందుకూరు రోడ్డు**

యాచారం, జూలై20: యాచారం నుంచి కందుకూరు వెళ్లే రోడ్డు మండల కేంద్రంలో చిన్న పాటి వర్షానికే అధ్వానంగా తయారవుతుంది. వాహనాల రాకపోకలతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు గుంతలమయంగా మారిన రోడ్డుతో నరకం చవిచూస్తున్నారు. అలాగే మండలంలోని మల్కీజ్‌గూడా-యాచారం రోడ్డు సైతం అక్కడక్కడా అధ్వానంగా మారింది. నందివనపర్తి-మేడిపల్లి రోడ్డు రెండు చోట్ల బ్రిడ్జీలు నిర్మించి వదిలేశారు. అక్కడ రోడ్డంతా గుంతల మయంగా మారింది. అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రయాణికుల, వాహనదారుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
**మైసిగండి ఆశ్రమ పాఠశాల పరిశీలన**



కడ్తాల్ : ఆశ్రమ పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జూలై 20: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహం గదులు, వంటశాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, సరిపడా తరగతి గదులులేవని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సమస్యల పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**

మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయం పరిసరాలలో విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండంతో సమస్యను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తీసుకెళ్లగా, వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసినట్లు తెలిపారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల అధ్యక్షులు నర్సింహ, బిచ్చానాయక్, జిల్లా కార్యదర్శి భీక్యానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, బాలరాజు, హీరాసింగ్, జవహర్‌లాల్, శేఖర్‌గౌడ్, కిషన్, షాబుద్దీన్, అమర్‌సింగ్, తులసీరాం, భగత్, రాందాసు, పీటర్, హెచ్‌డబ్ల్యూవో బాలరాజు, పంచాయతీ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

## నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

ఆమనగల్లు, జూలై 20: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్లు మండలంలో ఎంపీడీవో కుసుమ మాధురి ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నేనావత్ అనిత, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐలు వెంకటేశ్, వెంకటయ్య, ఎంపీవో ఉమారాణి, సూపరింటెండెంట్ రమేశ్, కార్యదర్శి రమేశ్, కాంగ్రెస్ మండల మండల అధ్యక్షుడు జగన్, కేఎన్ఆర్ యువసేన అధ్యక్షుడు మెకానిక్ బాబా, కాంగ్రెస్ నాయకులు విజయ్, విజయ్‌రాథోడ్, సురేశ్‌నాయక్, మైసయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## బీజేపీతోనే సంక్షేమ పథకాలు

**ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

చేవెళ్లటౌన్, జూలై 20: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొంత మేరకు కొనసాగుతున్నాయంటే అది మోడీ వల్ల సాధ్యమైందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని కేజీఆర్ గార్డెన్‌లో భారతీయ జనతా పార్టీ, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరిలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.9వేల కోట్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. పంట రుణాల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్న గారి వెంకట్‌రెడ్డి, నాయకులు నాగరాజు, అనంతరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

## ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి

చేవెళ్లటౌన్, జూలై 20: నాలుగు నెలలు కావస్తున్నా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు రాలేదని, 010 ట్రెజరీ ద్వారా ప్రతి నెల ఒకటో తారీఖు జీతాలు చెల్లించాలని చేవెళ్ల మాడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టేనవతి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 20వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు రాలేదని, ప్రతి నెలా ఈ విధంగానే జరుగుతుందని, బ్యాంకు ఈఎంఐలు, ఇంటి అద్దె చెల్లించలేక, కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యకమంలో ఉపాధ్యాయులు సునీత, వంశీధర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌గౌడ్, రుక్మిణీ, శ్రీ దేవి, మల్లీశ్వరి, ఆస్మా ఆమీర్, అనంత, యశోద, సుధీర, ఆంజనేయులు, శ్రీనివాస్, శివ, రమేశ్ ఉన్నారు.

## ముసురేసింది..

**పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు**

ఇబ్రహీంపట్నం, జూలై 20 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో వానలు జోరుగా కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

**షాబాద్ :** చేవెళ్ల నియోజకవర్గంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో కొద్ది పాటి వర్షం కురిసింది.




ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వాన

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి



షాబాద్, జూలై 20 : కుర్వగూడ గ్రామంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అపర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వీధి దీపాల కొరత ఉందని, ఆయా కాలనీల్లో పెరిగిన చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని తెలిపారు. ముఖ్యంగా అంతారం సబ్‌స్టేషన్ నుంచి రోజుకు పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, సమస్యలు వెంటనే పరిష్కరించి ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు మహేశ్, మల్లేశ్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

## విజయ డెయిరీ స్థాయిని పెంచాలి

మాడ్గుల, జూలై 20: మండలంలో విజయ డెయిరీ స్థాయిని పెంచాలని కోరుతూ, శనివారం షాద్‌నగర్‌లోని కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ శివాల్కర్‌యాదవ్‌ను మాడ్గుల మండల విజయ డెయిరీ సొసైటీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బీఎంసీల స్థాయిని పెంచి పాడి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మిల్క్ చిల్లింగ్ ట్యాంక్ సామర్థ్యాన్ని పది వేల లీటర్లకు పెంచాలని కోరారు. చిల్లింగ్ ట్యాంక్ సామర్థ్యం పెంపునకు డీడీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. అనంతరం డీడీని నాయకులు శాలువాతో సన్మానించారు.



విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న సొసైటీ చైర్మన్ సాయిరెడ్డి, మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం**
**చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన టీచర్లు**



కడ్తాల్ : అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత

షాద్‌నగర్‌టౌన్, జూలై 20: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని రతన్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభాస్యం చేయించారు. శనివారం అంగన్‌వాడీలో చిన్నారులను చేర్పించాలని అమ్మమాట అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు భారతి, మల్లమ్మ, హెల్పర్ స్వరూప, కాలనీవాసులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి**

నందిగామ : తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని నందిగామ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో విద్యార్థులకు మంచి పోషణతో కూడిన ఆహారం అందుతుందని, బాల్య దశలో పౌష్టికాహారం ఎంతో అవసరమని చెప్పారు. మూడు సంవత్సరాలలోపు పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు.



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో నాగమణి

**కడ్తాల్‌లో అవగాహన ర్యాలీ**

కడ్తాల్ : చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలోని 1, 2వ అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ చేపట్టారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి తల్లులకు సూపర్‌వైజర్, టీచర్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి

కడ్తాల్, జూలై 20: ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ఫొటోగ్రాఫర్లు విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్ల యూనియన్ మండల అధ్యక్షుడు నర్సింహ అన్నారు. శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయ ఆవరణలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఫొటోగ్రాఫర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారులు రమేశ్, విజయ్, గౌరవాధ్యక్షులు సుధీర్‌రెడ్డి, రవూఫ్, సభ్యులు ఆంజనేయులు, మహేశ్, కిరణ్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తల్లీకూతురు అదృశ్యం



తల్లీకూతురు (ఫైల్)

మొయినాబాద్, జూలై20: మేనమామ ఇంటికి వెళ్తానని బయలుదేరి వెళ్లిన తల్లీకూతురు ఇద్దరు అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన మహ్మద్ అమీర్ భార్య ఫాతిమా (25) రెండు నెలల కూతురు హనీమాఫాతిమాతో కలిసి నగరంలోని ఎల్బీనగర్‌లో ఉండే తన మేనమామ ఇంటికి వెళ్తానని ఈ నెల 13న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. మేనమామ ఇంటికి చేరుకోకపోగా, తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అమీర్ బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# పడకేసిన పారిశుధ్యం

**ప్రత్యేకాధికారుల పాలనలో చర్యలు శూన్యం**
**గ్రామాల్లో పారుతున్న మురుగుకాల్వలు**
**దోమలు, ఈగల స్వైర విహారంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు**
**ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు**



నాగన్‌పల్లి రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఇబ్రహీంపట్నం, జూలై 20 : గ్రామాల్లో పారిశుధ్య సమస్య మళ్లీ మొదటికొచ్చింది. గత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం కింద గ్రామాల్లో ఎప్పటికప్పుడు సానిటేషన్ కార్యక్రమం నిర్వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల పాలన ముందుకు సాగించారు. కానీ, ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది.

గతంలో ఇంటింటికీ గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారాచెత్తను సేకరించేవారు. కానీ ఇప్పుడదంతా కనిపించటంలేదు. ఇండ్లల్లో చెత్త పేరుకుపోతున్నది. ఇంటింటికీ ట్రాక్టర్ రావటంలేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసి దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మంచాన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో చూద్దామన్న చెత్త కనిపించేది కాదని, ప్రస్తుతం మళ్లీ వెనుకటికాలం వచ్చిందని దండుమైలారం గ్రామానికి చెందిన వెంకటమ్మ తెలిపారు. గతంలో పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మురుగుకాల్వలను శుభ్రం చేయటం, కలుపు మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించటం, దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ చేయటంతో పాటు ఇతర పారిశుధ్య పనులకు సంబంధించిన కార్యక్రమం నిర్వహించేవారు. కాని, ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియటంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఆరోపణలొస్తున్నాయి. గ్రామాల్లో సమస్యలున్నా పట్టించుకునే నాథుడే లేడని, గతంలో ఏ సమస్య ఉన్నా సర్పంచ్‌కు చెప్పేవారమని, ప్రస్తుతం ఎవరికి చెప్పాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామని, ప్రత్యేకాధికారులకు ఫోన్‌చేసినా పట్టించుకోవటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

**లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని సుమారు 87 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారు ఎప్పుడు వస్తున్నారో...ఎప్పుడు పోతున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఎక్కడపడితే అక్కడ పారిశుధ్య సమస్య తలెత్తడంతోపాటు, సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణలేకపోవడంతో పారిశుధ్య సమస్య మరింత పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత..**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విషజ్వరాలు ప్రబలుతుండటంతో పేదప్రజలు ప్రభుత్వ దవాఖానకు వెళ్తున్నప్పటికీ సరైన మందులు, వైద్యచికిత్సలు అందటం లేదని ఆరోపిస్తున్నారు. విషజ్వరాలు వస్తే ప్రైవేటు దవాఖానకు వెళితే పెద్ద మొత్తంలో డబ్బులు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని పేద ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ దవాఖానల్లో సరైన మందులతో పాటు వైద్య చికిత్సలు అందించాలని వారు కోరుతున్నారు.

**మెరుగైన వైద్యం అందించాలి**



గత ప్రభుత్వ హయాంలో వర్షాలు ప్రారంభం సమయంలో దోమలు, ఈగలు విజృంభించకుండా పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజలకు ఎలాంటి రోగాలు దరిచేరకుండా చర్యలు చేపట్టింది. సర్కారు దవాఖానల్లో రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సర్కారు దవాఖానకు పోవాలంటేనే ప్రజలు జంకుతున్నారు. నేటికీ అందుబాటులో మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

**- నిట్టు జగదీశ్వర్, బీఆర్ఎస్వీ నాయకుడు**

**అవగాహన కల్పిస్తున్నాం..**



గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీలతో పాటు ఇతర సిబ్బంది ద్వారా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులున్నా స్థానిక దవాఖానలకు వచ్చి చికిత్స చేయించుకోవాలి. రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉంచేందుకు కృషిచేస్తున్నాం.

**- పూనం, ప్రభుత్వ వైద్యాధికారి, దండుమైలారం**

## 30న సీతాఫలాల సేకరణకు టెండర్

కడ్తాల్, జూలై 20: ఆమనగల్లు అటవీ శాఖ డివిజన్ పరిధిలోని కందుకూరు రేంజ్ ఫారెస్ట్ ఏరియాలో, సీతాఫలాల సేకరణకు టెండర్‌ను నిర్వహిస్తున్నట్లు శాఖ సెక్షన్ అధికారి హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న అటవీ శాఖ ఆధ్వర్యంలో గుర్రంగూడలోని టింబర్ డిపోలో ఉదయం 11 గంటలకు టెండర్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీతాఫలాల సేకరణకు ఆసక్తి ఉన్న వారు అదే రోజు రూ.10వేలు డిపాజిట్ చేసి, టెండర్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

## 22న చలో కలెక్టరేట్

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 20 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశి, తరంగ్ పాల్గొన్నారు.